
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





ప్రజావేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అభివృద్ధి.. మీ బాధ్యత

- విమానాశ్రయానికి భూములు గుర్తించండి
- ఉద్యాన పంటలను ఎగుమతి చేద్దాం
- రైతులకు సాగునీరు అందిద్దాం
- ఉమ్మడి జిల్లా నేతలతో సీఎం చంద్రబాబు

ఉమ్మడి అనంతపురం జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో శనివారం ప్రజావేదిక ముగిసిన అనంతరం కలెక్టర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సాగునీరు, వ్యవసాయం, మౌలిక వసతులు తదితరాలపై చర్చించారు. ఉద్యాన పంటలను ఎగుమతి చేసేందుకు విమానాశ్రయం ఏర్పాటు చేద్దామని, అనువైన ప్రాంతాన్ని, భూములను గుర్తించాలని సీఎం సూచించారు. అంతకు మునుపు ఆయన నేమకల్లులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. 'ప్రజా వేదిక- పేదల సేవలో' సభలో ప్రసంగించారు. ప్రగతిబాటలో రాష్ట్రాన్ని నడిపించేందుకు శ్రమిస్తున్నామని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

(వివరాలు 6లో...)

పురం ఖాకీల్లో.. వణుకు..!



- నేరస్థులతో అంటకాగిన వారిపై బదిలీ వేటు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి స్థాన చలనం
- మరి వారి సంగతేంటి..?



హిందూపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందన్న ఆరోపణలు వచ్చాయి. కిందిస్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి వరకు కొంతమంది వైసీపీ క్రియాశీలక కార్యకర్తలుగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అలాంటి పోలీసులను గుర్తించి బదిలీచేసి ఎస్పీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆ దిశగా జిల్లాలో ఇప్పటికే రెండు విడతలుగా హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. హిందూపురంలో కొంతమంది సిబ్బందిపై ఎస్పీ కొరడా ఝుళిపించారు.

అంటకాగిన వారిపై బదిలీ వేటు

కొద్దిరోజుల క్రితం చిలమత్తూరు మండలంలో జరిగిన సామూహిక అత్యాచారం కేసులో నిందితులుగా ఉన్న పాత నేరస్థులతో హిందూపురం, పెనుకొండ సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న కొంతమంది గతంలో అంటకాగారు. పాత నేరస్థులు చేసిన కొన్ని తప్పులకు సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినట్లు జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లింది. దీంతో డీఐజీ, ఎస్పీ పాత నేరస్థులతో బంధాలున్న సిబ్బందిని గుర్తించి వారిపై లోతుగా విచారణ చేయించినట్లు తెలిసింది. ఇందులో వారితో ప్రమేయం ఉన్న ఓ ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను గత నెలలో సస్పెండ్ చేశారు. పది రోజుల క్రితం ఇద్దరు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. తాజాగా శుక్రవారం రాత్రి వెలువడిన పోలీసుల బదిలీల్లో మరి కొంతమందిని వివిధ సబ్‌డివిజన్లకు బదిలీచేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కరుడుగట్టిన అంతర్‌రాష్ట్ర పాత నేరస్థులతో 13 మంది సిబ్బందికి సంబంధాలు ఉన్నట్లు జిల్లా ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో హిందూపురం, పెనుకొండ పరిధిలో ఉన్న సిబ్బందిపై వేటువేశారు. పక్క జిల్లాలో ఉన్న కొందరిని అలాగే ఉంచినట్లు తెలుస్తోంది. వీరిపై ఆ జిల్లా ఎస్పీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. హిందూపురంలో కొంతమంది సిబ్బంది ఒకేచోట ఉండి అధికారులపైనే విమర్శలు చేయడం, ఫిర్యాదులు చేయడం గుర్తించిన ఎస్పీ ఒక్కొక్కరిని ఒక సబ్‌డివిజన్‌కు బదిలీచేసినట్లు తెలుస్తోంది.

వారి సంగతేంటి..?

హిందూపురం, పెనుకొండ సబ్‌డివిజన్‌లలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంతమంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు వైసీపీకి వీరవిధేయులుగా ఉంటూ వారికి సహకరించారు. కొన్ని సందర్భాల్లో వైసీపీ నాయకులకంటే ఎక్కువగా క్రియాశీలక కార్యకర్తలుగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నా అలాంటి వారు ఇంకా ఆ స్టేషన్లలోనే ఉంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల పనులు సజావుగా జరగడమే కాదు పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న విషయాలు ఆ పార్టీ నాయకులకు చేరవేస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. అలాంటి వారిలో కొందరిని కూటమి నాయకులే వెనకేసుకురావడంతో మిగిలిన నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమందిపై అవినీతి ఆరోపణలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం మారినా ఇప్పటికీ వారిలో మార్పు రాలేదు. ఇలాంటివారిపై బదిలీవేటు ఎప్పుడు పడుతుందోనని చర్చ జరుగుతోంది.

ఎక్కువ కేసులను పరిష్కరించండి

- లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి
- సమీక్షా సమావేశంలో ఎస్పీ రత్న



పుట్టపర్తి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో కోర్టు కానిస్టేబుళ్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డిసెంబరు 14న జాతీయమెగా లోక్ అదాలత్ జరుగుతుందని, ఇందులో భాగంగా కక్షిదారులకు అవగాహన కల్పించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, ఇతర కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. దీని వల్ల సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ, సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారానికి చొరవచూపే సిబ్బందికి ప్రోత్సాహకాలు ఉంటాయని ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ ఎంపీపీపై చీటింగ్ కేసు

పెనుకొండ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పూర్వీకుల ఆధీనంలో ఉన్న తమ భూములను ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ, అతడి బంధువులు ఫోర్జరీ సంతకాలు చేసి కబ్జాచేశారని మండలంలోని రైతులు కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పెనుకొండ మండలంలోని చిన్నపరెడ్డిపల్లి, గుట్టూరు గ్రామాలకు చెందిన రైతులు పోలీసులు ఫిర్యాదు చేశారు. సర్వేనంబరు 449 భూమిలో శాంతమ్మకు చెందిన 15 సెంట్లు, రాజుకు చెందిన 15 సెంట్లు, 420 సర్వేనంబరులో రామ్మోహన్‌కు చెందిన 80 సెంట్ల భూమిని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, తమ్ముడు వెంకటక్రిష్ణ, బంధువు రవి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ భూములను కబ్జాచేసి అమ్మకాలు జరిపారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీపీ ఆదినారాయణ, వెంకటక్రిష్ణ, రవిపై చీటింగ్, సంతకాల ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు కియా పోలీసులు తెలిపారు.

పొరపాట్లు లేకుండా మార్పులు చేర్పులు

- ఓటరు జాబితా సవరణ సక్రమంగా జరగాలి
- ఎన్నికల పరిశీలకుడు కన్నబాబు



మాట్లాతున్న ఎన్నికల పరిశీలకుడు కన్నబాబు

పుట్టపర్తి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా మార్పులు, చేర్పుల్లో పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు కన్నబాబు ఆదేశించారు. కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వోలతో కూడా ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, నిబంధనల మేరకు 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వంద శాతం ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలని సూచించారు. 2025 జనవరి 1నాటికి ఓటరు నమోదుకు ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, ఆర్డీవో సువర్ణ, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో 95 శాతం పూర్తి అయినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. 1వ తేదీ ఆదివారం కావడంతో శనివారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టి 95 శాతం పూర్తి చేశామన్నారు. అత్యధికగా ధర్మవరం అర్బన్‌లో 96.50 శాతం, కనగానిపల్లిలో 91 శాతం అందించామన్నారు. మిగిలిన వారికి ఆది, సోమవారాల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

పాపం.. పసిపాప

- శివాలయం వద్ద.. దిక్కులేకుండా..
- గజగజ వణికే చలిలో ఆక్రందనలు
- కాపాడిన అయ్యప్ప భక్తులు
- శిశుగృహ కేంద్రానికి తరలింపు



శివాలయం వెనుక చిన్నారి

సోమందేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమ్మ, నాన్న అనే పిలుపుకోసం దంపతులు పరితపిస్తారు. గుళ్లు, గోపురాలు, ఫెర్టిలిటి సెంటర్ల చుట్టూ చక్కర్లు కొడుతూ పిల్లల కోసం పరితపిస్తుంటారు. అలాంటిది మూడు రోజుల పసికందును గజగజ వణికించే చలిలో వదిలేసి వెళ్లారు. సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామంలో శివాలయం వెనుక శుక్రవారం అర్ధరాత్రి ఆ పసి కందును వదిలి వెళ్లినట్లున్నారు. అయ్యప్పమాలను ధరించిన భక్తులు ఆంజనేయస్వామి ఆలయంలో రాత్రి బస చేసి, శనివారం ఉదయం స్నానాల కోసం శివాలయానికి వెళ్లారు. చిన్నారి ఏడ్పులు విని చుట్టుపక్కల గాలించారు. ఆలయం వెనుక ఉంచిన చిన్నారిని సెల్‌ఫోన్ వెలుగులో గుర్తించారు. వెంటనే ఆ బిడ్డను ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి సర్పంచ్ లలితమ్మకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆమె పోలీసులకు విషయాన్ని తెలియజేయడంతో వారు స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవికి తెలిపారు. ఆమె ఆ బిడ్డను స్వగృహానికి తీసుకెళ్లి తోటి టీచర్ల సాయంతో శుభ్రంచేసి బట్టలు మార్చారు. అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. చిన్నారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స చేశారు. సోమందేపల్లి సీడీపీఓ అనురాధ చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది లక్ష్మీప్రసన్నతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం చిన్నారిని పుట్టపర్తిలోని శిశుగృహ కేంద్రానికి తీసుకెళ్లి అప్పగించారు.



చిన్నారిని తీసుకెళ్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

చేతన్ హత్యపై లోకేశ్ ఆరా
- హెచ్ఎం సస్పెన్షన్..
- ఫిజికల్ డైరెక్టర్‌కు షోకాజ్

7లో...

అంగన్‌వాడీల్లో మందుల కొరత

- పట్టించుకోని అధికారులు
- ఆరోగ్య కార్యకర్తలపై ఆధారపడుతున్న వైనం

ఫస్ట్ ఎయిడ్‌బాక్స్



ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మెడికల్ కిట్ల కొరత వేధిస్తోంది. కేంద్రంలో దెబ్బలు తగిలినా, జలుబు, జ్వరం, దగ్గు వంటివి సోకినా చిన్నారులను ఇంటికి పంపుతున్నామని, నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. సత్యసాయి జిల్లాలో 12 ప్రాజెక్టుల కింద 2,824 అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి కింద 2801 మంది కార్యకర్తలు, 2,196 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఈ కేంద్రాల్లో 10,931 మంది గర్భిణీలు, 9,394 మంది బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లలు మొత్తం 1.10 లక్షల మంది ఉన్నారు. వీరికి పోషణతో పాటు, బలవర్ధక ఆహారం, ఆలనా, వారి సంక్షేమం విషయంలో అంగనవాడీ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు స్వల్ప అనారోగ్యం, చిన్నచిన్న గాయాలకు వెంటనే వైద్యసేవలు అందించాలని ఫస్ట్‌ఎయిడ్ కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కిట్‌లో పలు రకాల ఔషధాలు, కొన్ని సిరప్‌లు ఉండేవి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం తక్కువ మోతాదులో మెడికల్ కిట్లు అందించింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఏ ఒక్క అంగన్‌వాడీ కేంద్రంలో మెడికల్ కిట్లు కనిపించలేదు. అరకొరగా ఉన్నచోట ముఖ్యమైన మందులు అయిపోయాయి. నెలలు గడుస్తున్నా సరఫరా చేయలేదు. చిన్నారుల తల్లులు అడుగుతున్నా కిట్లు, మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఇది అంగన్‌వాడీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది.

ఇండెంట్ పెట్టాం : వెంకటలక్ష్మి, ఇన్‌చార్జ్ పీడీ, ఐసీడీఎస్, సత్యసాయి జిల్లా

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మందుల కొరత ఉన్నది వాస్తవమే. మందుల కొరతపై ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టాం. ప్రస్తుతం ఇబ్బంది లేకుండా గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్త ద్వారా మందులు తీసుకుని చిన్నారులకు అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి మెడికల్ కిట్లు రాగానే కేంద్రాలకు పంపిణీ చేస్తాం.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

- పింఛన్ల పంపిణీలో మంత్రి సవిత



పింఛన్ అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ఎన్డీఏ ప్రధాన అజెండా అని, వారి కష్టాలు తీర్చడంలో ప్రభుత్వం ముందుంటుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగానే శనివారం పంపిణీ చేశారు. పెనుకొండ పట్టణంలోని దర్గాపేటలో మంత్రి సవిత టీడీపీ శ్రేణులు, అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. బాబయ్యస్వామి దర్గా వద్ద జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న దోసెలబండి వద్ద మంత్రి సవిత దోసె వేసి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ నాయకులు టీడీపీ వస్తే పింఛన్ సక్రమంగా ఇవ్వదని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని తెలిపారు. తమ ప్రభుత్వం ఒకరోజు ముందే పింఛన్లు ఇచ్చి పేదల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకుందని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు దాదు, శ్రీరాములు, సిద్దయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, త్రివేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

అలరించిన అవతార వైభవం

పుట్టపర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ విద్యార్థులు నర్తించిన సత్యసాయి అవతార వైభవం సంగీత నృత్యరూపకం భక్తులను అలరింపచేసింది. హైదరాబాద్ భక్తులు పర్తియాత్ర పేరిట 1800 మంది శనివారం ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సాయికుల్వంతు మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మొదట హృదయనివాసి సత్యసాయి అంటూ భక్తిగీతాలాపన చేపట్టారు. అనంతరం బాలవికాస్ చిన్నారులు సత్యసాయి అవతార్ పేరిట సంగీత నృతరూపకాన్ని నిర్వహించారు. చిన్నారులు తమ నృత్యంతో భక్తులను అలరింజేశారు.



పాటలు పాడుతున్న భక్తులు

కంకర మాటున గ్రానైట్ తరలింపు

- కొండలో యథేచ్ఛగా తవ్వకాలు
- రైతుల ఆందోళన
- చోద్యం చూస్తున్న అధికారులు

తాడిమర్రి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కంకర తవ్వేందుకు అనుమతులు తీసుకుని యథేచ్ఛగా గ్రానైట్ తరలిస్తున్నా అధికారులు చోద్యం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అవేవీ తమ దృష్టికే రాలేదని అధికారులు అంటున్నారు. గడిచిన ఆరు సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. తాడిమర్రి మండలంలోని మద్దెలచెరువు, కునుకుంట్ల మధ్య ఉన్న తెల్లకొండ నుంచి కంకర తరలించేందుకు ఓ ప్రైవేటు కంపెనీ 2013లో అనుమతి పొందింది. 2018 నుంచి పనులు ప్రారంభించి కంకర తరలింపు చేపట్టింది. ఇటీవల కాలంలో తెల్లకొండ పైభాగాన విలువైన గ్రానైట్ లభ్యమవుతున్నట్లు సమాచారం. అనుమతి పొందిన కంపెనీ యజమాని కొండ పైకి ఎక్స్‌కవేటర్లు తరలించి గ్రానైట్ బండలను వెలికితీస్తున్నారు. దీనికి యంత్ర సామగ్రిని ఉపయోగించి బీహార్ కూలీల ద్వారా పనులు సాగిస్తున్నారు. ఏదైనా కొండను తవ్వే కార్యక్రమం చేపట్టే ముందు సాధారణంగా పర్యావరణ అనుమతులు పొందాలి. తద్వారా కొండ ప్రాంతంలో ఎన్ని చెట్లు కూల్చివేస్తారో అంతకు మరిన్ని మొక్కలను నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలా ఏమీ జరగలేదు. విలువైన గ్రానైట్ తవ్వకాలు చేస్తుండడంతో కొండ ప్రాంత రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొండను పూర్తిగా తొలిచేస్తే తమ భూములు నిస్సారం కావడంతో పాటు వర్షాకాలంలో కొండ పైనుంచి వచ్చే వర్షపు నీరు రాకుండాపోతుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే భారీ యంత్రాలు పనిచేస్తుండటంతో జింకలు, అడవిపందులు, సమీప గ్రామాల్లోకి వెళ్తున్నాయి. ఐదు నెలల క్రితం కునుకుంట్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు చిరుత సంచరించి రైతులను భయభ్రాంతులకు గురిచేసింది. కనీసం అధికారులు స్పందించి పర్యావరణాన్ని కాపాడేలా సమీప కొండ ప్రాంతంలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గ్రానైట్, కంకర తరలింపు ద్వారా వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇది ఎక్కడా జరగలేదు.



గ్రానైట్ బండలను కట్ చేస్తున్న కూలీలు

గుప్త నిధుల కోసం వేట..?

మద్దెలచెరువు గ్రామ సమీపంలోని తెల్లకొండ వద్ద దర్గీలో గుప్త నిధులు ఉన్నాయని పూర్వం నుంచే ఆ పరిసర ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తుంటారు. కొన్నిసార్లు వాహనాల్లో వెళ్లి గుప్తనిధుల కోసం వేట సాగిస్తుంటారని గ్రామస్థులు అంటున్నారు. కునుకుంట్ల గ్రామ ప్రజలకు కొండలోజరుగుతున్న సమాచారం తెలుస్తుంటుంది. ఇప్పుడు గ్రానైట్ తవ్వకాలు చేపడుతున్న ప్రాంతానికి 10 మీటర్ల దూరంలోనే దర్గీ కూడా ఉంది. పనిలో పనిగా ఇది కూడా సాగుతోందా అని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



లారీలో గ్రానైట్‌ను తరలిస్తున్న దృశ్యం

గ్రానైట్ తరలింపు నా దృష్టికి రాలేదు




మద్దెలచెరువు గ్రామం వద్ద కంకర, గ్రానైట్ తరలింపు కోసం తవ్వకాలు చేపడుతున్నట్టు నా దృష్టికి రాలేదు. ప్రస్తుతం నేను కోర్టు పనిమీద విజయవాడ వెళ్తున్నాను. వచ్చిన తరువాత రెండు రోజుల్లో పూర్తి వివరాలు అందిస్తా.

\- భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్

అభివృద్ధి.. మీ బాధ్యత: సీఎం

అనంతపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దాం. అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. నేమకల్లులో ప్రజావేదిక అనంతరం హెలీప్యాడ్ వద్ద కలెక్టర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి గురించి చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేద్దామని, అందుకు అవసరమైన భూములు గుర్తించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు అనువైన ప్రాంతాన్ని, అవసరమైన భూములను గుర్తించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగునీరును అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనుల పురోగతిని ప్రభుత్వం దృష్టి తీసుకురావాలని, నిధుల కోసం చొరవ చూపాలని అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురంలో డంపింగ్ యార్డు మార్చేందుకు అనువైన ప్రాంతం చూడాలని, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చొరవ చూపాలని చంద్రబాబు సూచించారు. శింగనమల నియోజకవర్గానికి తాగునీటిని అందించేందుకు గండికోట నుంచి పైపులైన్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పేరూరు, అప్పర్ పెన్నార్ పనులు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. నడిమి వంక ప్రొటెక్షన్ వాల్, రాప్తాడులో జాకీ పరిశ్రమను తిరిగి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు


ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు సవిత, కేశవ్, కలెక్టర్


సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు


చంద్రబాబును దగ్గరగా చూసిన ఆనందం


మహిళల కేరింతలు

పలకరింపులు.. పులకరింపులు

పింఛన్ లబ్ధిదారుల ఇంటికి చంద్రబాబు

వీధుల్లో నడుస్తూ.. జనంతో మాటామంతీ

బొమ్మనహాళ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేమకల్లులో పాల్తూరు రుద్రమ్మ, భాగ్యమ్మ ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. రుద్రమ్మ ఇంట్లో టీ ఇవ్వబోతే.. ధన్యవాదాలు తెలిపారు. భాగ్యమ్మ ఇంట్లో టీ స్వీకరించారు. గ్రామ వీధుల్లో నడుస్తూ.. ప్రజలను పలకరించారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ సాధారణ పౌరుడిలా తమ ఊరి వీధుల్లో తిరగడం చూసి జనం మురిసిపోయారు.



పాల్తూరు రుద్రమ్మ: నమస్కారం సార్ బాగున్నారా ?
చంద్రబాబు: నమస్కారం అమ్మా. మీరు బాగున్నారా ? ఎంత మంది కొడుకులు ?
పాల్తూరు రుద్రమ్మ: బాగున్నాము సార్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు.
చంద్రబాబు: ఫింఛన్ డబ్బులు ఎంతిస్తారు ?
పాల్తూరు రుద్రమ్మ: నాలుగు వేలు ఇస్తున్నారు సార్.
చంద్రబాబు: కొడుకులు ఏం పని చేస్తారమ్మా ?
పాల్తూరు రుద్రమ్మ: వ్యవసాయం చేస్తున్నారు సార్
చంద్రబాబు: మీ కుటుంబానికి ఏమి కావాలమ్మ..?
పాల్తూరు రుద్రమ్మ: గొర్రెలు, ఇల్లు కావాలి సార్.
చంద్రబాబు: సరే అమ్మా. మీకు ఇల్లు, గొర్రెలు ఇస్తాము.

రుద్రమ్మ కొడుకులు గణేష్, మారేష్‌తో..


చంద్రబాబు : బాగా పనిచేసుకోవాలి. ఊరికే ఉంటే ఎలా ? పొలం ఎంత ఉంది..?
గణేష్, మారేష్ : రైతు పని చేస్తున్నాం సార్. మూడెకరాలు ఉంది సార్, పంట సరిగా రావడం లేదు.
చంద్రబాబు : ఓకే అమ్మా.. మీకు సాయం చేస్తా.. వస్తాను.

దివ్యాంగురాలు భాగ్యమ్మ ఇంట్లో..



భాగ్యమ్మ : నమస్కారం సార్
చంద్రబాబు : నమస్కారం అమ్మా. ఫింఛన్ ఎవరికి వస్తుంది..?
భాగ్యమ్మ : నాకు, మా నాన్నకు వస్తుంది సార్.
చంద్రబాబు : ఎంత వస్తుందమ్మా ?
భాగ్యమ్మ: నాకు 15 వేలు, మా నాన్నకు నాలుగు వేలు సార్..
చంద్రబాబు: పొలం ఎంత ఉంది ?
భాగ్యమ్మ : ఏడెకరాలు ఉంది.
చంద్రబాబు: ఇంట్లో ఎంత మంది ఉన్నారు ?
భాగ్యమ్మ: తొమ్మిది మంది ఉన్నాం సార్.
చంద్రబాబు: పింఛన్ డబ్బులు ఏమి చేస్తున్నారు ?
భాగ్యమ్మ: నా తమ్ముడి కూతురు జాహ్నవికి బాగా లేదు. వైద్యం కోసం ఖర్చు పెడుతున్నాం సార్.
చంద్రబాబు: ఓకేనమ్మా మీకు ఇల్లు కట్టించి, కిరాణాషాపు పెట్టిస్తాం. ఆర్థిక సాయం చేస్తాం.
భాగ్యమ్మ : టీ తాగండి సార్
చంద్రబాబు : సరే అమ్మా.. ఇవ్వండి..

(టీ తాగిన తర్వాత ప్రజావేదికపై చంద్రబాబు భాగ్యమ్మ తమ్ముడి కూతురు వైద్య ఖర్చుల కోసం రూ.రెండు లక్షల చెక్కును అందించారు. భాగ్యమ్మ ఇంటి నుంచి వస్తూనే రోడ్డు పక్కన అంగడి పెట్టుకున్న హనుమేష్‌ను పలకరించారు..)



చంద్రబాబు: ఏం తమ్ముడూ బాగున్నావా ?
హనుమేష్: బాగున్నాను సార్.
చంద్రబాబు : ఏం అంగడి ?
హనుమేష్: కిరాణా అంగడి సార్.
చంద్రబాబు: ఎంత వ్యాపారం అవుతుంది ?
హనుమేష్ : రూ.100 నుండి రూ.150 వస్తుంది సార్
చంద్రబాబు: నెలకు ఎంత వ్యాపారం అవుతుంది..?
హనుమేష్: ఐదు వేల వరకూ అవుతుంది సార్.
చంద్రబాబు: కలెక్టర్ గారూ, సూపర్‌మార్కెట్ కోసం లోన్ మంజూరు చేయించండి.

ప్రగతికి బాటలు





రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాయదుర్గం నియోజకవర్గ ప్రగతికి బాటలు వేసేలా వరాల జల్లు కురిపించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సమర్పించిన వినతి పత్రంలో పొందుపరిచిన అంశాలన్నింటికీ సానుకూలంగా స్పందించారు. ప్రజా వేదిక మీదుగా ఆయన పలు హామీలు ఇచ్చారు. నేమకల్లు-ఉంతకల్లు మధ్యలో ఐదు టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించిన రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి కృష్ణజలాలను మళ్లించేందుకు రూ.965 కోట్లతో చేపట్టిన పనులు 35 శాతం మాత్రమే పూర్తయ్యాయి. వైసీపీ హయాంలో పనులు ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని చంద్రబాబు అన్నారు. కృష్ణజలాలతో రాయదుర్గం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసానిచ్చారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా 36ఎ ప్యాకేజీ ద్వారా మాల్యం, ఆవులదట్ల డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేసి, నీరిస్తామన్నారు. జిల్లాలో ఎడారి ఛాయలు ఇక్కడి నుంచే మొదలు అవుతున్నాయనే విషయం తనకు తెలుసునని, 20 వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇసుకమేటలను నియంత్రించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇనుప ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో నేమకల్లు - డి.హీరేహాళ్ మధ్యలో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ప్రాంతాన్ని పారిశ్రామిక పార్క్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. డి.హీరేహాళ్‌లో సబ్ సర్ఫేస్ డ్యాం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని అన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట చెరువును హెచ్చెల్సీకి అనుసంధానించి, సాగునీరు ఇస్తామని అన్నారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు.

ఉంతకల్లు, బీటీపీ పనులకు భరోసా

నేమకల్లులో సోలార్ పైలెట్ ప్రాజెక్టు

ప్రజా వేదికపై ప్రకటించిన చంద్రబాబు

నేమకల్లులో సోలార్ పైలెట్ ప్రాజెక్ట్

'ఇంటింటికీ సోలార్ పవర్' ప్రాజెక్టును నేమకల్లు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. నేమకల్లులో ఉన్న 759 ఇళ్లపై సోలార్ ప్యానల్స్‌ను సబ్సిడీ ద్వారా అమర్చి విద్యుత్ ఉత్పత్తి చేయిస్తామని అన్నారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వాడుకుని, మిగిలిన విద్యుత్‌ను విక్రయించే అవకాశం కూడా కల్పిస్తామని అన్నారు. 1,49,721 చదరపు అడుగులలో సోలార్ ప్యానల్స్ అమర్చి 1379 కిలో వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టును ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నామని సీఎం ప్రకటించారు.

సెల్‌ఫోన్‌లో పౌర సేవలు

ఇంట్లో కూర్చుని సర్టిఫికెట్లు తీసుకోవచ్చు

గంజాయి, ఇసుక మాఫియా తోలు తీస్తాం

రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపిస్తాం

నేమకల్లు సభలో సీఎం చంద్రబాబు




రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చేతిలో ఉండే సెల్‌ఫోన్‌తో కుటుంబంలోని ప్రతి వ్యక్తికి ప్రభుత్వ సేవలన్నీ అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేమకల్లులో శనివారం ఫించన్ల పంపిణీ అనంతరం 'ప్రజా వేదిక పేదల సేవలో..' సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగం ప్రవాహంలా గంటకుపైగా సాగింది. రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రసంగించారు. మద్యం, గంజాయి, ఇసుక మాఫియా తోలు తీస్తామని హెచ్చరించారు. నేమకల్లు అంజనేయస్వామి ఆలయం ముందు కార్యక్రమం జరుగుతోందని, స్వామి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు 11వ తేదీన కణేకల్లుకు వచ్చానని, ఆ 11 అంకెను ప్రతిపక్షానికి ఇచ్చానని చమత్కరించారు. సభలో ఉన్న అందరూ తమ సెల్‌ఫోన్‌లను ఎత్తి చూపాలని కోరారు. భవిష్యత్తులో సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందిస్తామని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సర్టిఫికెట్లు తీసుకునే పరిస్థితి ఉండదని అన్నారు. స్వామివారి దర్శనం చేసుకుని బయటకు రాగానే వేదిక వద్ద ఉన్న జనం కేరింతలు వేశారు. ఆయన ప్రసంగాన్ని ఉత్సాహంగా వింటూ.. చప్పట్లతో మద్దతు తెలిపారు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారని, రేషన్ మాఫియాను కట్టడి చేస్తామని అన్నారు. భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు ఫైళ్లపై సంతకాలు పెట్టామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనంతగా రూ.4 వేలు పింఛన్ ఇస్తున్నామని చెబుతూ.. ఇతర రాష్ట్రాలలో ఎంత ఇస్తున్నారో గణాంకాలను తెలిపారు. దీపం-2 పథకం గురించి వివరిస్తూ.. తన తల్లి కట్టెల పొయ్యితో పడిన కష్టాలను గుర్తు చేసుకున్నారు. మహిళలు ఎవరికీ ఆ కష్టం ఉండకూడదనే అప్పట్లో దీపం పథకం తెచ్చామని, ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామని అన్నారు. అర్హులందరికీ ఉచిత సిలెండర్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. నాలుగు గంటల పాటు సాగిన సీఎం పర్యటన.. ప్రశాంతంగా ముగిసింది.

ఏ హడావుడీ లేకుండా..

ముఖ్యమంత్రి పర్యటన అంటే.. ఎక్కడ లేని నిబంధనలను అమలు చేస్తారు. దుకాణాలను మూసివేయిస్తారు. వైసీపీ హయాంలో పరదాలనూ కట్టించారు. చెట్లు నరికించి, బారికేడ్లు ఏర్పాటు చేయించి.. నిర్బంధం మధ్య పర్యటనలు సాగించారు. కూటమి ప్రభుత్వం అలాంటి సంస్కృతికి చరమగీతం పాడింది. నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీఎం సభ ఉన్నా.. ఆలయ కాంప్లెక్స్ ఉండే దుకాణాలు యథాతథంగా తెరిచారు. ఎప్పటిలాగే వ్యాపారాలు చేసుకున్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కలిగించలేదు. ముందస్తు అరెస్టులు లేవు. ప్రజలందరూ స్వేచ్ఛగా ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసమీకరణ ఏమాత్రం చేయలేదు. ఆ ఊరి ప్రజల మధ్య సభ సాగింది. ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడలేదు.


చంద్రన్నకు అంజన్న చిత్రపటం కానుక

చంద్రబాబు కృషితోనే హార్టికల్చర్ హబ్: అంబికా



కరువు ప్రాంతమైన జిల్లాపై చంద్రబాబు ప్రత్యేక ప్రేమాభిమానాలు చూపిస్తున్నారని ఎంపీ లక్ష్మీనారాయణ అన్నారు. చంద్రబాబు చొరవతో 2014 నుంచి జిల్లాలో అరటిసాగు పెరిగిందని, 20 టన్నులతో అప్పట్లో ఎగుమతిని ప్రారంభించి.. ఏకంగా లక్ష టన్నులకు చేర్చారని కొనియాడారు. అరటి ఎగుమతి కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారని, అనంత అరటి విదేశాలకు పంపేస్థాయికి చేర్చారని అన్నారు. 10వేల హెక్టార్లలో పండించిన 8.5 లక్షల టన్నుల అరటిలో లక్ష టన్నుల అరటిని విదేశాలకు పంపుతున్నామని అన్నారు. జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారిందని, ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తే అరటి, దానిమ్మ, సపోట, బత్తాయి దిగుబడులను విదేశాలకు పంపే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో ఏడు కరువు మండలాలను ప్రకటించారని, మిగిలిన మండలాలను కూడా ప్రకటించాలని కోరారు.

దేశం మెచ్చే నాయకుడు: కాలవ



ఐదేళ్ల దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించిన చంద్రబాబు దేశం మెచ్చే నాయకుడు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. నేమకల్లు ప్రజావేదికపై ఆయన ప్రసంగించారు. కాలవ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం చంద్రబాబుతో పాటు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు మహాలక్ష్మి పాల్గొన్నారు. నేమకల్లు - ఉంతకల్లు మధ్యలో రిజర్వాయర్ నిర్మించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు. రాయదుర్గంపై చంద్రబాబుకు ప్రత్యేక ప్రేమాభిమానాలు ఉన్నాయని అన్నారు. 2014-19 మధ్య కాలంలో రూ.4500 కోట్లు మంజూరు చేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. జిల్లాకు వరప్రసాదం లాంటి హంద్రీనీవా తొలిదశ విస్తీరణ పనులను త్వరలో చేపట్టడానికి సీఎం సంసిద్ధులై ఉన్నారని అన్నారు. అది పూర్తి అయితే భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు నీరు వస్తుందని అన్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు 36ఎ ప్యాకేజీ కింద 64 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎడారీకరణ ఆగేలా సీఎం చర్యలు తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. బీసీలు అధికంగా ఉన్న నేమకల్లులో బాలురకు ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పీహెచ్‌సీతో పాటు ఆంజనేయస్వామి గోపురానికి రూ.3.75 కోట్లు మంజూరు చేయాలని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలను పూర్తి చేయడానికి రూ.ఐదు కోట్లు మంజూరు చేయాలని కోరారు.


చెల్లెమ్మ సెల్ఫీ సంబరం

రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు నేమకల్లు హెలీప్యాడ్ వద్ద ఘనస్వాగతం లభించింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, సెర్ప్ సీఈఓ వీర పాండ్యం సీఎంకు స్వాగతం పలికారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, అహూడా చైర్మన్ టీసీ వరుణ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చంద్రబాబుకు పుష్ప గుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి స్వాగతం పలికారు.

పర్యటన ఇలా..

సీఎం చంద్రబాబు మధ్యాహ్నం 1.30 గంటలకు నేమకల్లు హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న వాహనంలో మధ్యాహ్న భోజనాన్ని ముగించారు. ఆ తరువాత 2.20 గంటలకు రుద్రమ్మ ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. 2.36 గంటలకు భాగ్యమ్మ ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. అక్కడి నుంచి గ్రామ వీధుల్లో నడుచుకుంటూ 2.48 గంటలకు నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని 3.05 గంటలకు ప్రజావేదిక వద్దకు చేరుకుని ప్రసంగించారు. 4.12 గంటలకు సమావేశాన్ని ముగించుకుని హెలీప్యాడ్ వద్దకు బయలుదేరారు. 4.25 గంటలకు హెలీక్యాప్టర్‌లో బళ్లారిలోని జిందాల్ విమానాశ్రయానికి బయలుదేరారు.

స్వాగతం.. సుస్వాగతం..!


పూల బొకేతో కాలవ స్వాగతం


చంద్రబాబుకు నమస్కరిస్తున్న కేశవ్


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, జేసీ అశ్మిత్ రెడ్డి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి


ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎమ్మెస్ రాజు

కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీఎం

మొక్క అందజేసిన జేసీ..

అసిస్టెంట్ కలెక్టర్..

డీఐజీతో మాటా..మంతీ

సీఎంతో ప్రభాకర్ చౌదరి

న్యూస్ బాక్స్

ఏఆర్‌టీ సెంటర్‌కు పురస్కారం



జిల్లా ఆస్పత్రిలో హెచ్‌ఐవీ బాధితులకు సేవలందిస్తున్న ఏఆర్‌టీ సెంటర్ ఇదే..

అనంతపురంటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులకు ఉత్తమ సేవలందించినందుకు అనంత సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కింది. ఈఏడాదిలో 48మంది గర్భిణులు, 111మంది టీబీ రోగులు, 166మంది హెచ్‌ఐవీ బాధితులకు ఈసెంటర్‌లో అవసరమైన వైద్యసేవలు అందించారు. ఈనేపథ్యంలో ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకొని ఇక్కడి సేవలను గుర్తించి రాష్ట్ర ఉత్తమ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో అవార్డును ఏఆర్‌టీ సెంటర్ డాక్టరు సత్యనారాయణ ఆదివారం అందుకోనున్నారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టరు హేమలత, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టరు అనుపమజేమ్స్ ఆయన్ను అభినందించారు.

జాతీయ పోటీలకు నవనీత్



అనంతపురం క్లాక్ టవర్, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన నవనీత్ ఎంపికయ్యాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-19 ఫెన్సింగ్ క్రీడాపోటీల్లో నవనీత్ మెరుగైన ప్రతిభ చాటాడు. దీంతో అతడిని జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 15 నుంచి బిహార్ రాష్ట్రం పాట్నాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొననున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన నవనీత్‌ను ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు కోన ఉప్పలపాడు విద్యార్థి



లోకనాథ్

యాడికి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు కోన ఉప్పలపాడు హైస్కూల్ విద్యార్థి లోకనాథ్ ఎంపికైనట్లు పాఠశాల పీడీ చిన్నఓబులు, ప్రధానోపాధ్యాయుడు చిన్నపెద్దన్న శనివారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరుజిల్లా పూతలపట్టులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో అండర్-14 విభాగంలో త్రోబాల్ పోటీలో లోకనాథ్ అద్భుతమైన ప్రతిభ చూపినట్లు వెల్లడించారు. జాతీయస్థాయిపోటీలకు ఎంపికైన లోకనాథ్‌ను టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, కోనుప్పలపాడు సర్పంచు రామలక్షుమ్మ, గ్రామస్థులు అభినందించారు.

ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీ

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 17247/48) రైళ్లకు డిసెంబరు నెలలో ఒక అదనపు బోగీని జతచేసి నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లకు డిసెంబరు 1 నుంచి జనవరి 1 వరకూ ఒక 2టైర్ ఏసీ బోగీని చేర్చి నడపనున్నట్లు తెలిపారు.

845 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 845 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 748 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 26 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 20, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.29వేలు

అనంతపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 29,400 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 19వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 29 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వికసిత్ భారత్‌కు ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న యువతను ఆహ్వానించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ తెలిపారు. 2025 జనవరి 11, 12వతేదీల్లో ఢిల్లీలోని భారత్‌మండపంలో నిర్వహించే స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాలలో ప్రధాని మోదీతో సంభాషించే అవకాశం యువతకు కల్పిస్తున్నట్లు తెలిపారు. మోదీతో నేరుగా మాట్లాడేందుకు డిసెంబరు 5లోపు మేరాభారత్ ప్లాట్‌ఫాం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అడ్డేది..?

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సరీలు
- ప్రభుత్వ అనుమతులు కొన్నింటికే
- నాసిరకం మొక్కలు అంటగడుతున్న వైనం
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారయంత్రాంగం



నర్సరీలో పెంచుతున్న టమోటా నారు

సంప్రదాయ పంటలతో ఎప్పుడూ నష్టాలే వస్తుండటంతో పలువురు రైతులు కూరగాయల పంటల సాగువైపు మొగ్గుతున్నారు. ఈక్రమంలోనే టమోటా, మిర్చి వంటి పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ పంటల సాగుకు అవసరమైన మొక్కల కోసం నర్సరీలపై ఆధారపడుతున్నారు. రైతుల అవసరాల దృష్ట్యా పుట్టగొడుగుల్లా నర్సరీలు పుట్టుకొచ్చాయి. ఇందులో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. అసలు ప్రభుత్వ అనుమతులే తీసుకోవడం లేదు. ఫలితంగా నాసిరకమైన మొక్కలను రైతులకు అంటగడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు నర్సరీల నిర్వాహకులు అంటగట్టిన మొక్కలతో తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సరీల నిర్వాహకులు తమను మోసం చేశారని రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుతం నియోజకవర్గంలో 200 పైబడి నర్సరీలు ఉన్నాయి. వీటిలో చాలా వరకూ నిబంధనలకు పాతరేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

- కళ్యాణదుర్గం/కుందుర్పి (ఆంధ్రజ్యోతి)

● నిబంధనలు ఇలా...

నర్సరీల నిర్వాహకులు నాణ్యమైన, నమ్మకమైన ఉద్యాన మొక్కలను తయారు చేసి రైతులకు అందించాలి. సిఫారసు చేసిన ఉద్యాన పంటల రకాల నారును మాత్రమే సిద్ధం చేయాలి మొక్క పేరు, మూలాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పురుగులు, తెగుళ్ల సోకని మొక్కలను రైతులకు సరఫరా చేయాలి. ఐదేళ్లలో జరిగిన మొక్కల అమ్మకాల వివరాలను యాజమాన్యం రికార్డు చేయాలి. మొక్కలను ఎక్కడి నుంచి తెచ్చారు, వాటి ధరలను బోర్డులపై ఉంచాలి. ప్రభుత్వం నుంచి తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలి.

● కనిపించని ఉద్యానశాఖ అధికారులు

ఉద్యాన పంటల నాణ్యమైన మొక్కలు, విత్తన తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012లో జీవో. నెంబర్. 211 ద్వారా ఉద్యాన పంటల నర్సరీల చట్టాన్ని రూపొందించింది. అనుమతులు లేకుండా నర్సరీలను కొనసాగించరాదని, ఆ విధంగా చేస్తే చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే నియోజకవర్గంలో అనేకచోట్ల అనుమతులు లేకుండా నర్సరీలను నిర్వహిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నకిలీ మొక్కలను రైతులకు అంటగడుతున్నారని, ఎన్నో సార్లు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. దీంతో నర్సరీ నిర్వాహకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. పైరు ఎదిగే వరకు అది నకిలీ నారా లేదా మంచిదా అనేది తెలియడం లేదు. అప్పటికే ఆ రైతులు భారీగా పంటపై పెట్టుబడి పెట్టి ఉంటారు. దిగుబడి రాకపోవడంతో పెట్టుబడితో పాటు కాయ కష్టాన్ని కూడా నష్టపోతున్నాడు.

● కర్ణాటకకు పరుగులు

నియోజకవర్గంలో నర్సరీల నిర్వాహకులు నాసిరకం టమోటా మొక్కను రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నిసార్లు ఉద్యానశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా ఇది ఆగడం లేదు. దీంతో విసుగు చెందిన రైతులు నాణ్యమైన టమోటా మొక్కల కోసం సమీపంలోని కర్ణాటక ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. చెళ్లికెర, పావగడ ప్రాంతాలకు వెళ్లి టమోటా, మిరప మొక్కలను ఎక్కువగా తీసుకొస్తున్నారు. అక్కడి నుంచే తెచ్చే మొక్కలు నాణ్యతగా ఉంటూ ఎక్కువ దిగుబడి ఇస్తున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



కుందుర్పి మండలంలో నర్సరీని తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారులు (ఫైల్)

● 50 నర్సరీలకే పరిమితం

కళ్యాణదుర్గం ప్రాంతంలో 200 నర్సరీలకు పైబడి ఉన్నాయి. ఇందులో సుమారు 50 నర్సరీలకు మాత్రమే అనుమతి ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మిగతా వాటికి దేనికీ లైసెన్సులు లేవు. దీనిపై అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ఆయా నర్సరీల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. జిల్లా ఉద్యానశాఖాధికారులు నర్సరీల నిర్వాహణపై తనిఖీలు చేసినా, పూర్తి స్థాయిలో నిబంధనలు అమల్లోకి రాలేదు. టమోటా సాగు ఈ ప్రాంతంలో లాభసాటిగా ఉండటంతో రైతులు ఎక్కువ శాతం మంది టమోటా సాగుకే మొగ్గు చూపుతారు. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని నర్సరీలు పుట్టగొడుగులా వెలిశాయి.

● మోసంపై దుప్పటి పంచాయితీలు

నాసిరకం టమోటా మొక్క ఇచ్చి, మోసం చేశారని, మీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని రైతులు గట్టిగా నర్సరీ నిర్వాహకులను నిలదీస్తే కొంతమంది పెద్ద మనుషుల సాయంతో దుప్పటి పంచాయతీ చేసి చేతులు దులుపుకున్న సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల్లో ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కొంతమంది రాజకీయనాయకులు కూడా ఈ పంచాయితీలోకి దూరి నష్టపోయిన రైతులకు అంతో ఇంతో డబ్బులు ముట్టచెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి.

నోటీసులు ఇస్తున్నాం

అనుమతులు లేని నర్సరీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని నర్సరీల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొందరు చేయించుకోలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. నకిలీ మొక్కలు ఇస్తున్నారని ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- గౌసియామీ, ఉద్యానశాఖాధికారి

నాసిరకం టమోటా పైరుతో నష్టపోయా



నాకున్న ఐదెకరాల్లో విడతల వారీగా టమోటా సాగు చేశా. అయితే నాసిరకం టమోటా మొక్కలు ఇవ్వడంతో ఏ మాత్రం పంట దిగుబడి రాలేదు. దీంతో పూర్తిగా నష్టపోయా. కుందుర్పి మండలంలోని ఓ నర్సరీలో టమోటా మొక్కలు తీసుకొచ్చి సాగు చేస్తే పంట మొత్తం పోయింది. దీంతో పంట రాక, పెట్టుబడులు నష్టపోయి తీవ్ర ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయా.

- రామాంజనేయులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

పంట ఎదుగుదల లేదు



నాకున్న మూడెకరాల్లో టమోటా మొక్క సాగు చేశా. రోజులు గడిచినా మొక్కలో ఎదుగుదల కనిపించలేదు. ఎన్ని మందులు పిచికారి చేసినా ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు. దీంతో కాస్త అనుభవం ఉన్న రైతులను తీసుకువచ్చి పంటను చూపించగా వారు పరిశీలించి, నాసిరకం మొక్కలతోనే ఇలా జరిగిందని చెప్పారు. దీంతో పెట్టుబడి మొత్తం నష్టపోయా. నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. -బొమ్మయ్య, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

పూత, పిందె నిలబడలేదు



నాసిరకం టమోటా మొక్కల్లో పూత, పిందె ఏ మాత్రం నిలబడలేదు. నాకున్న నాలుగెకరాల్లో టమోటా పంటను సాగు చేశా. మూడు కోతలకే టమోటా పంట పూర్తిగా దిగుబడి కోల్పోయింది. ఏ మాత్రం ఎదుగుదల ఉండదు. నాసిరకం మొక్కను అందించే నర్సరీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

చేతన్ హత్యపై లోకేశ్ ఆరా

- హెచ్ఎం సస్పెన్షన్.. ఫిజికల్ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీస్
- హంతకుల కోసం ప్రత్యేక బృందాల వేట
- బాలుడి హత్య కేసు దర్యాప్తు వేగవంతం



చేతన్ (ఫైల్)

మడకశిర/మడకశిరటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మడకశిర మండల పరిధిలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న విద్యార్థి చేతన్ హత్య ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. అసలు ఏం జరిగింది అంటూ అధికారుల నుంచి సమాచారం తెలుసుకొన్నారు. పాఠశాల నుంచి ఉదయం 10.30 గంటలకు విద్యార్థి వెళితే పోలీసులకు సైతం సమాచారం ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కనీసం 100కు కూడా డయల్ చేయకుండా ఏం చేస్తున్నారంటూ జిల్లా స్థాయి అధికారులతో ఆరా తీసినట్లు తెలిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో చిన్నారి కిడ్నాప్ అయిన విషయంపై కేసును పోలీసులకు అందించడం పట్ల మండిపడ్డారు. ఇన్ని గంటల వ్యవధిలో ఏమి చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. మంత్రి లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాబేజ్‌పై జిల్లా అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అదే విధంగా ఫిజికల్ డైరెక్టర్ ప్రసూనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి జి.కిష్టప్ప ఆమిదాలగొంది ప్రధానోపాధ్యాయుడు జాబేజ్‌ను సస్పెండ్ చేస్తూ అందులో పీఈటీగా పనిచేస్తున్న ప్రసూనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కడప ఆర్‌జేడీ ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు డీఈఓ వెల్లడించారు. సీఎంఓ కార్యాలయం సైతం ఆరా తీయడంతో స్వయంగా ఎస్పీ రంగంలోకి దిగి నిందితులను ఇప్పటికే గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. వారిని రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. హత్యకు గల కారణాలు, ఆ అవసరం ఎందుకు వచ్చింది అన్న కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మడకశిర సర్కిల్ కార్యాలయంలోనే ఉంటూ స్వయంగా దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. సీఐలు రామారావు, రాజ్‌కుమార్‌లకు సూచనలు ఇస్తూ దర్యాప్తును ఓ కొలిక్కి తెచ్చారు. హత్యకు సంబంధించిన ఆయుధాలను సైతం ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఎంత మంది ఇందులో పాల్గొన్నారన్న దానిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టినా పాఠశాల సిబ్బంది ఏమాత్రం సహకారం అందివ్వలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం జరిగితే సాయంత్రం 5.30 గంటల నుంచి 6 గంటల మధ్యలోనే మడకశిర పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఫిర్యాదు అందించినట్లు పోలీసులు సైతం చెబుతున్నారు. పాఠశాల నుంచి విద్యార్థి బయటకు వెళ్లాలంటే తప్పనిసరిగా ఉపాధ్యాయుల అనుమతి తీసుకోవాలి. అలాంటివి ఏమీలేకుండా విద్యార్థి వెళ్లినా ఎందుకు స్పందించలేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

ఇద్దరు పిల్లలు.. తల్లి అదృశ్యం



కుళ్లాయమ్మ, పిల్లలు

అనంతపురం క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన భర్త పోలీసులను ఆశ్రయించాడు. నగరంలోని ఓబుళదేవ్‌నగర్‌లో మన్నల నరేష్, కుళ్లాయమ్మ(లహరి) దంపతులు నివాసముంటున్నారు. వీరి మధ్య శనివారం వాగ్వాదం జరిగింది. భర్త నరేష్ భార్యను మందలించాడు. దీంతో మధ్యాహ్నం 3గంటల నుంచి కుళ్లాయమ్మ తన పిల్లలు తేజేశ్వర్(ఏడేళ్లు), హారిక(ఆరేళ్లు)తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రయినా రాకపోవడంతో భర్త టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సున్నీ ఇజ్‌తెమాను జయప్రదం చేయండి

- ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి



సున్నీ ఇజ్‌తెమా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమాను జయప్రదం చేయాలని వక్ఫ్ బోర్డు సభ్యుడు, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి కోరారు. స్థానిక జామియా మసీద్‌లో సున్నీ ఇజ్‌తెమాకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ షఫి మాట్లాడుతూ తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిసెంబరు 22న ఇజ్‌తెమాను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మధ్యప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ ఖాదీర్ ముఖ్య అతిథిగా హాజరై ఆధ్యాత్మిక సందేశమిస్తారన్నారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెహరీక్ అధ్యక్షుడు హసన్‌రజాసాబ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదాగాంధీ, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆవాజ్ వలి, ముతవల్లి ఫరీదుద్దీన్, పర్వీష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలలో శివలింగ ప్రతిష్ఠ



శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి వద్ద బండపై వెలసిన అయ్యప్ప ఆలయ ఆవరణంలో శనివారం శివలింగ విగ్రహప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహమ్మద్‌రఫీ సహకారంతో శివాలయ నిర్మాణం, శివలింగ ప్రతిష్ఠ చేపట్టినట్లు ఆలయ సంకల్పకుడు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. ఆలయ నిర్మాణ దాత మహమ్మద్‌రఫీ దంపతులు పురోహితుడు పంచరత్న సురేష్ శర్మతో కలిసి శివలింగ ప్రతిష్ఠాపన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.మల్లికార్జునరెడ్డి, మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకులు అరుణజ్యోతి, మాజీ కోఆప్షన్ సభ్యుడు నిజాం తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్లకు కలెక్టర్ హెచ్చరిక

పుట్టపర్తి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో లింగనిర్ధారణ నియంత్రణ చట్టంపై కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ నియంత్రణ చట్టంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. వైద్యశాఖాధికారులు నిరంతరం తనిఖీ చేసి లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడే సెంటర్ల అనుమతులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శైలజ, డీఎంహెచ్ఓ మంజువాణి, ఆర్డీటీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్లపడితే అట్లా..!

- ఉరవకొండలో కొళాయిల అక్రమ కనెక్షన్లు
- పట్టించుకోని అధికారులు

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొళాయి అక్రమ కనెక్షన్లు పెరిగిపోయాయి. అనుమతులు లేకుండానే ఎవరు పడితే వారు రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను అడ్డంగా తవ్వేసి, కనెక్షన్లు తీసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా సాగిన వ్యవహారం కూటమి ప్రభుత్వంలో కూడా చాప కింద నీరులా సాగుతోంది. వైసీపీ ఎంపీటీసీ ఆదేశంతో అక్రమంగా కనెక్షన్లు ఇస్తున్నారు. అయితే అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కుళాయిల ఏర్పాటు సమయంలో రోడ్డు కటింగ్‌కు సంబంధించి పంచాయతీ అధికారులతో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అవేమీ పట్టనట్లుగా ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేసే సిబ్బంది కాసులు పుచ్చుకుని కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.

గతంలో వందకు పైగా అక్రమ కనెక్షన్లు



కుళాయి కనెక్షన్ కోసం తవ్విన గుంత

గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో దాదాపు వందకు పైగా అక్రమంగా కనెక్షన్లు ఇచ్చారు. ప్రధానంగా డ్రైవర్స్ కాలనీ, లక్ష్మీనరసింహకాలనీలో జలజీవన్ ముసుగులో అక్రమంగా కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. ప్రజలనుంచి కనెక్షన్‌కు రూ.10వేలు దాకా వసూలు చేశారు. అప్పట్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీటిపై విచారణ చేశారు. కొళాయి అక్రమ కనెక్షన్లకు సంబంధించి డీడీ రూపంలో డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు. అయినా అవి ఆచరణ సాధ్యం కాలేదు. సీసీ రోడ్లను అక్రమంగా తవ్వి కొళాయిలను బిగించారు. రోడ్డును తవ్వడం వలన గుంతలు పడి ఆయా ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బజయ్యను వివరణ కోరగా ఇప్పటి వరకు అక్రమ కొళాయిల ఏర్పాటుపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. వస్తే వాటిని తొలగిస్తామన్నారు.



జలజీవన్ పేరుతో తవ్విన రోడ్డు

న్యూస్ బాక్స్

సైబర్ నేరాల కట్టడిపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా, సైబర్ నేరాలపై స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి శ్యాంప్రసాద్ ఇందులో మాట్లాడారు. వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించడం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం నేరమన్నారు. వీటిని కేసులు పెట్టవచ్చన్నారు. సైబర్ క్రైంను అరికట్టడానికి 250 మంది కమాండోలను , 2000 మంది సైబర్ సోల్జర్స్‌కు శిక్షణ ఇచ్చి నియమించారన్నారు. ఎవరు ఫోన్ చేసి ఖాతా వివరాలు, ఓటీపీ వంటివి ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపాల్‌నాయక్, పావని, చిట్టెమ్మ, త్రివేణి, భువనేశ్వరి, కిరణ్‌కుమార్, సరస్వతి, పుష్పవతి, మీనా, ఆనంద్, హైమావతి పాల్గొన్నారు.

పౌరహక్కులపై ...

తనకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళం తండాలో శనివారం ఎస్‌ఐ గోపీ, రెవెన్యూ అధికారులు స్థానికులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పౌరుడికి ఉన్న హక్కులను వివరించారు. ఆ హక్కులకు భంగం కలిగిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

● ధర్మవరం : స్థానిక ఇందిరానగర్‌లో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై దళితులకు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ శనివారం రాత్రి అవగాహన కల్పించారు. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

ఎయిడ్స్ నివారణపై ...

కదిరి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సిత్మ మాట్లాడుతూ... ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణ రహిత కోసం ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొత్తచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మేజర్ గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు చిరంజీవి (58) అనారోగ్యంతో శనివారం మరణించాడు. ఎంపీడీఓ నటరాజ్, పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి నివాళులర్పించి.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పంచాయతీ నిధులు రూ.25 వేలు అందజేశారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

తనకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నోడల్ అధికారి వీరమ్మ శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

నల్లమాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో నల్లమాడ క్రాస్‌లో టీడీపీ నాయకుడు మైల శివశంకర్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో మైలే రామచంద్ర, సలాంఖాన్, రాజారెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, మణికుమారి, డీలర్ శంకర్, మల్లికార్జున, అరవిందు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

కదిరి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెబ్‌డెవలపర్ కోర్సులో యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిక్రిష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఈ కోర్సు వ్యవధి మూడునెలలుంటుందని అన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, ఆసక్తిగల అభ్యర్థులు 93901 76421ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

తనకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకువాండ్లపల్లి వెటర్నరీ ఆసుపత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ కేశవయ్య తమతో దురుసుగా వ్యవహరించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మీడియాతో వారు మాట్లాడుతూ.. వెటర్నరీ ఆసుపత్రికి పోయి సీజనల్ వ్యాధులు, పశువుల షెడ్లు గురించి వివరాలను సీపీఎం నాయకులు శివన్న, వీవీ రమణ అడగ్గా.. కేశవయ్య వారితో దురుసుగా ప్రవర్తించారన్నారు. 'అడగడానికి మీరెవరు ... బయటకు పోండిరా... పోకపోతే బయటకు తోయిస్తా' అంటూ దుర్భాషలాడినట్లు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అతనిపై చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం రమణ, శివన్న, సీపీఐ రెడ్డెప్ప, రవి, సీఐటీయూ ఒంటెద్దు వేమన్న, కాంగ్రెస్ తోపు పారేసు, రైతు సంఘం ఎస్వీ రమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.68 వేల అవినీతి



మాట్లాడుతున్న పీడీ విజయేంద్రప్రసాద్

తాడిమర్రి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీ ప్రజా వేదికను స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 703 పనులను రూ.6.92 కోట్లతో చేపట్టగా.. అందులో రూ.68,693 మాత్రమే అవినీతి జరిగిందని, రికవరీకి ఆదేశించామని అధికారులు తెలిపారు. గత ఏడాది రామాపురం గ్రామంలో ఎలాంటి అవినీతి జరగలేదని అధికారులు క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే 10 ఏళ్ల క్రితమే చనిపోయిన వారి ఖాతాల్లో కూడా డబ్బులు పడ్డాయని అధికారులకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ విచారణ చేపట్టారు. దీంతో రూ.కోటికి పైగా అవినీతి జరిగినట్లు లెక్కలు వేశారు. ఈ సారి కూడా రామాపురం గ్రామంలో కేవలం రూ.19,608 మాత్రమే అవినీతి జరిగిందని అధికారులు చెబుతుండటంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల సైతం పాత క్షేత్రసహాయకులను కాపాడే ప్రయత్నం చేశారే కానీ ఎక్కడ వారిమీద మచ్చ పడనీయడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ వెంకటాచలపతి, అంబుడ్స్‌మెన్ శివశంకర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారావు, ఏపీఓ సంజీవరెడ్డి, ఎస్ఆర్‌పీ తిరుమలేశ్, సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సమస్యలు

- సిబ్బంది కొరత.. ఉన్నవారు సెలవుల్లో..
- పది సచివాలయాలు, 14 గ్రామ పంచాయతీలకు ముగ్గురే కార్యదర్శులు
- ఏడు గ్రామ పంచాయతీలకు ఒకే కార్యదర్శి
- పరిష్కారం కాని ప్రజా సమస్యలు

సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన సచివాలయాలే.. సమస్యలతో కొట్టుమిట్టాడు తున్నాయి. సచివాలయాల్లో సిబ్బంది కొరత .. ఉన్న సిబ్బంది పని భారంతో సెలవుల్లో ఉండటంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయంలో కార్యదర్శితో సహా సిబ్బంది సెలవుపై వెళ్లడంతో సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒకే కార్యదర్శికి అదనంగా ఆరు గ్రామ పంచాయతీల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించ డంతో పని భారంతో సతమతమ వుతున్నాడు. ఏ రోజు.. ఏ కార్యాల యంలో.. విధులు నిర్వహించాలో తెలియక అయోమయంలో ఉంటు న్నారు. ఇక కార్యదర్శి ... ఇన్‌చార్జ్ కార్యదర్శి ఏ సచివాలయంలో ఉంటారో తెలిక ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు.





సిబ్బందిలేక ఖాళీగా ఉన్న ఎన్నీకుంట సచివాలయం -2

నంబులపూలకుంట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలో 10 గ్రామ సచివాలయాలున్నాయి. ఇద్దరు డీడీఓ స్థాయి అధికారులుండగా, ఒక గ్రేడ్ -4 కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. ధనియాన్‌చెరువు గ్రామ సచివాలయం డీడీఓకు అదనంగా ఆరు సచివాలయాల బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎన్నీకుంట 1, 2, మరికొమ్మెదిన్నె, పి.కొత్తపల్లి, పెడబల్లి సచివాలయాలు, వంకమద్ది గ్రామ పంచాయతీకి కూడా ఇతను ఇన్‌చార్జీగా వ్యవహరించాల్సి ఉంది. ఎదురొనకు చెందిన డీడీఓ మేకలచెరువు, వెలిచెలమల, గొనపేట సచివాలయాలకు ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్నారు. పడమరనడింపల్లి పంచాయతీ కార్యాలయానికి గ్రేడ్ -4 కార్యదర్శి విధుల్లో ఉన్నారు. వంకమద్ది కార్యదర్శి చైల్డుకేర్ సెలవులో ఉన్నారు. బలిజపల్లి కార్యదర్శి ఇటీవల మరణించారు. పి.కొత్తపల్లి, పెడబల్లి గ్రామ సచివాలయంతోపాటు తూర్పునడింపల్లి గ్రామ సచివాలయం కార్యదర్శులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక మిగిలిన కార్యదర్శులందరూ సెలవుల్లో ఉన్నారు.

● ఇబ్బందుల్లో ప్రజలు :

సచివాలయ సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనన, మరణాలను 21 రోజులలోపు తప్పకుండా నమోదు చేయిచుకోవాలి. వీటి ధ్రువీకరణ పత్రాలు గ్రామ సచివాలయంలో కార్యదర్శుల వద్ద పొందాల్సి ఉంది. అయితే కార్యదర్శులు ఏ సమయంలో ఎక్కడ ఉంటారో తెలీక ఇబ్బందులు పడుతున్నారు. ఇక అపార్ కోసం విద్యార్థులు పుట్టిన తేదీతో పాటు, ఆధార్‌లో చేర్పులు, మార్పుల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పలు ప్రభుత్వ పథకాల అమలు, అర్హుల గుర్తింపు, సర్వే, అవగాహన కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది నిర్వహించాల్సి ఉంది. అయితే సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కాక.. అభివృద్ధి కుంటుపడుతోంది. దీనిపై ఇన్‌చార్జీ ఎంపీడీఓ అంజనప్పను వివరణ కోరగా.. కొంతమంది సిబ్బంది సెలవుపై వెళ్లారని, ఉన్న సిబ్బందితోనే సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. తహసీల్దార్ నరేంద్రకుమార్‌ను వివరణ కోరగా.. విద్యార్థుల సర్టిఫికెట్లు తమ కార్యాలయానికి వచ్చిన వెంటనే సంతకాలు చేసి పంపుతున్నామన్నారు.

నెల రోజులుగా తిరుగుతున్నాం



నా కుమార్తె ఇంటర్ చదువుతోంది. పుట్టిన తేదీ తప్పుగా ఉంది. మార్చుకోవడానికి నెల రోజులుగా ఆస్పత్రి, తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం చుట్టూ తిరుగుతున్నాం. సొంత పనులు వదలుకుని తిరుగుతున్నా సర్టిఫికెట్ రావడంలేదు. కాలేజీ వారు సర్టిఫికెట్ త్వరగా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- ఈశ్వరయ్య, నంబులపూలకుంట

కార్యదర్శి లేదు



పి.కొత్తపల్లి సచివాలయానికి కార్యదర్శి లేదు. మాకు ఇన్‌చార్జీగా ఉన్న ధనియాన్ చెరువు కార్యదర్శి ఎన్నీకుంటలో ఉన్నారంటే ఇక్కడికి వచ్చాం. ఇక్కడికి వచ్చాక తెలిసింది అతను మరికొమ్మెదిన్నె సచివాలయంలో ఉన్నాడని.. నా కుమారై పుట్టిన తేదీ మార్పు కోసం వచ్చాను. ఎక్కడికి పోవాలో.. ఎప్పుడిస్తారో తెలియడంలేదు. వ్యవసాయ పనులు వదిలేసి వారం రోజులుగా తిరుగుతున్నా.

- రామమోహన్‌రెడ్డి, బత్తినగారిపల్లి

చెరువులకు నీరివ్వండి: ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి నియోజకవర్గంలో 195 చెరువులను హంద్రీనీవా నీటితో నింపే ప్రాజెక్టును పూర్తీ చేస్తే నియోజకవర్గం మరో కోస్తాంధ్ర అవుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని విజ్ఞప్తిచేశారు. శనివారం రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహళ్ మండలం నేమకల్లులో మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ... 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 3.34 కోట్లతో డీపీఆర్‌తో ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేశారని, ప్రస్తుతం ఆ ప్రాజెక్టును త్వరగా పూర్తీ చేస్తే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. దీనివల్ల 10 వేల ఎకరాలు సాగులోకి వస్తాయని, 2.24 లక్షల మందికి తాగునీరు లభిస్తుందని వివరిం చారు. 2009 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సైన్స్ సిటీ పేరుతో 1100 ఎకరాలు రైతుల నుంచి సేకరించారని, ఆ భూములు నిరుపయోగంగా ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూముల్లో రిలయన్స్ బయో ఆయిల్ ప్రాజెక్టును కాని.. మహిళలకు ఉపాధి కల్పించే పరిశ్రమలను కాని నెలకొల్పాలని కోరారు.

స్వామి సేవలో ...

పావగడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పావగడ శనేశ్వరస్వామి ఆలయాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం దర్శించుకొన్నారు. సీతాలంబకు, శనేశ్వరుడికి పూజలు నిర్వహించారు.



ఆలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



కదిరిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పింఛన్ల పంపిణీ

కదిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక 32 వార్డులో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంటింటికి వెళ్లి... లబ్ధిదారులకు శనివారం పింఛన్లు అందించారు. వలంటీర్ల లేకపోయినా, ఉద్యోగులతోనే ఉదయం 9 గంటలకే 90 శాతం పింఛన్లు అందిచామన్నారు. గతంలో పింఛన్ ఇచ్చే రోజు తీసుకోకపోతే పింఛన్ వచ్చేదికాదని, కాని కూటమి ప్రభుత్వంలో మూడు నెలలకు ఒకేసారి పింఛన్ తీసుకునే సౌకర్యం కల్పించిందని అన్నారు.

● కొత్తచెరువు / బుక్కపట్నం : కొత్తచెరువులో, మండలంలోని కేశాపురంలో, బుక్కపట్నంలో వృద్ధులకు, వికలాంగులకు ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం పింఛన్ పంపిణీ చేశారు. ఇందులో సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

ఉత్సాహంగా గ్రీన్ డే

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో శనివారం ఘనంగా గ్రీన్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చరంగు దుస్తులతో అలరించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, విద్యార్థులు చెట్లు నాటారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపరాజా కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రీన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాసమస్యలను అధికారులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ యాదవ్

ముదిగుబ్బ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ ఆదినారాయణయాదవ్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమపథకాలు అందాలంటే ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. భూ సర్వే ద్వారా ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. ముదిగుబ్బ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని, ఖరీఫ్‌లో వేరుశెనగ పంట, కందిపంట సాగు ఉందని అన్నారు. కరువు మండలంగా ప్రకటించడంతో రూ.12.30 కోట్ల ప్రతిపాదన ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ మెంబర్లు,



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శ్రీవారికి ప్రాకారోత్సవం

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి శనివారం పురష్కరించుకుని పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రాకారోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. సేవా కర్తలు గొర్తి భారతీదేవి, గొర్తి సుధా కర్‌నాయుడు దంపతులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్న కేశవపురంలోని భవిత కేంద్రంలో న్యాయవిజ్ఞాన సదస్సు, మెడికల్ క్యాంప్ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవిజ్ఞాన సేవాసదస్సులో సీనియర్ సివిల్ జడ్జీ గీతావాణి స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వాసుదేవరెడ్డి, ఐఎంఏ ప్రసిడెంట్ ఉరుకుందప్ప, లయన్స్‌క్లబ్ ప్రసిడెంట్ వేణుగోపాల్, డాక్టర్‌లు చంద్రిక, లలిత, ఎంఈఓ రాజేశ్వరి, న్యాయవాది బాలసుందరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి గీతావాణి

వడ్డెర్ల సంఘం ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ప్రముఖులు

తనకల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద మండల వడ్డెర్ల సంక్షేమ సంఘం ఎన్నికను శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఈతోడుకు చెందిన క్రిష్ణప్ప, మహిళ అధ్యక్షురాలిగా ఇడగొట్టు హిమగిరిజ, కార్యదర్శిగా రవి, గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులు, మహిళ గౌరవాధ్యక్షురాలిగా రమణమ్మను ఎన్నుకున్నట్లు నియోజకవర్గ అధ్యక్షుడు కుచ్చెపు గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు ఉత్తన్న, సభ్యులు ఉత్తన్న, తలుపుల గంగరాజు, నాగార్జున, బాబు, రమణమ్మ, రాజేష్, ఆనంద్, పలువురు వడ్డెర్లు పాల్గొన్నారు. ఈఓఆర్డీ దివాకర్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిసివారిపల్లి గ్రామం వద్ద శనివారం జూదమాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,150 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇసుక వాహనాల స్వాధీనం

ముదిగుబ్బ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసీరేవు ఇసుక రీచ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను శనివారం సాయంత్రం రాళ్ల అనంతపురం క్రాస్ సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. వాటిని మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు.

కనీస సౌకర్యాలూ కరువే.!

● కస్తూర్బా కాలనీలో తాండవిస్తున్న సమస్యలు ● కూటమి నాయకులైనా పట్టించుకునేరా...?

ముదిగుబ్బ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బా కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో అనంతపురం రోడ్డులోని ఈ కాలనీలో కనీస సౌకర్యాలూ లేవు. కస్తూర్బా పాఠశాల సమీపంలో గత టీడీపీ హయాంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాల్లో 2017 నుంచి ఇళ్ల నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఇది అతిపెద్దకాలనీగా ఏర్పడింది. ఇక్కడ 400 కుటుంబాలు ఉండగా 1000 మంది నివాసముంటున్నారు. ఇది టీడీపీ హయాంలో ఏర్పడిన కాలనీ కాబట్టి.. గత వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ కాలనీలో వీధిలైట్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. కస్తూర్బా పాఠశాలకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె ఏర్పాటు చేయలేదు. తక్కువ ఎత్తులో ఫీజులు ఏర్పాటు చేయడంతో పాఠశాల విద్యార్థులు పొరపాటున తాకే ప్రమాదముంది. కనీస సౌకర్యాలు కల్పించాలని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులను, ప్రజా ప్రతినిధులను పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ హెల్త్ సెంటర్, బస్‌షెల్టర్, సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.





డ్రైనేజీ, సీసీ రోడ్డు లేని కస్తూర్బా కాలనీలోని వీధి, కస్తూర్బా పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సీసీ రోడ్లు ఏర్పాటు చేయండి



మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఏ అధికారి కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోలేదు. వీధిలైట్లు లేక రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

- వెంకటేశ్, కస్తూర్బా కాలనీ

కనీస సౌకర్యాలు కల్పించాలి



కాలనీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతి నిధులపై ఉంది. వీధిలైట్లు, సీసీ రోడ్లు లేక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

- రంగనాయకులు, కస్తూర్బాకాలనీ

జయమంగళికి గర్భశోకం




నదిని ఆక్రమించి కంచె వేసిన దృశ్యం

- మట్టి తరలింపుతో అడుగడుగునా గోతులు
- మధ్య మధ్యలో ఇటుక బట్టీలు
- కంచెలతో కబ్జాకు గురవుతున్న నదీ గర్భం

పరిగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు నదీ తీరాలన్నీ మనోహరంగా, సహజ ప్రశాంతంగా ఉండేవి. ప్రస్తుతం ఇసుక, మట్టికి పెరిగిన డిమాండ్ కారణంగా నదులన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. పరిగి సమీపంలోని పెన్నా, జయమంగళి నదులలో ఆక్రమణలు, మట్టి తరలింపు కారణంగా అవి కుంచించుకుపోతున్నాయి. మండల పరిధిలో ముళ్ల మోతుకపల్లి గ్రామం నుంచి పైడేటి గ్రామందాకా పెన్నా, జయమంగళి నదులు సుమారు 15కి.మి. మేర పొడవునా ప్రవహిస్తున్నాయి. గతంలో నదీ గర్భాలలో పంటలు పండించుకోవడానికి ఏక్‌సాల్ పట్టాఅని ఇచ్చేవారు. ఆ ప్రాంతంలో పుచ్చ, కర్భూజా లాంటి పంటలు పండించడం వలన అక్కడకు ఎవరూ వచ్చేవారుకారు. నదీ గర్భాలు సురక్షితంగా ఉండేవి. కాని కాలక్రమంలో ఆ విధానం పాటించకపోవడంతో ఇతర ప్రాంతాలవారు ఇసుక కోసం పరిగి మండల వ్యాప్తంగా నదులలో యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టడంతో భూగర్భజలాలు అంతరించే ప్రమాదం కనబడుతోంది. ఎవరికీ బాధ్యతలు అప్పగించకుండా ప్రభుత్వ అధికారులు ఎంతకాలం కాపలా కాస్తారు? ఇది అవకాశంగా తీసుకుని కొందరు వ్యక్తులు వ్యవసాయం పేరిట నదులను ఆక్రమించుకుని ఏకంగా కంచెవేసుకుని వ్యాపారాన్ని సాగిస్తున్నారు. మరికొందరు మట్టిని ఇసుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు మండల ప్రజలు అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇకనైనా అధికారులు చెరువులు, కుంటలు, నదులను కాపాడడానికి ఒక విధానాన్ని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దోపిడీదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రి సమయాల్లో మట్టి తరలింపు



రాత్రి సమయాల్లో నదులలో అక్రమంగా మట్టి తరలిస్తూ నదీ గర్భాలను తవ్వేస్తున్నారు. దీంతో నది అంతటా గుంతలు ఏర్పడుతున్నాయి. వారిపై ప్రభుత్వం నిఘా ఉంచి కట్టడిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
మూర్తి, ఊటకూరు

నదుల్లో కంచెలు వేసి ఆక్రమిస్తున్నారు

నదులను ఆక్రమించుకుని పునాదుల కోసం నదుల్లో కంచె వేస్తున్నారు. దీంతో వర్షాలు పడినపుడు నదీ ప్రవాహం గట్లు తెంచుకుని ఊళ్లమీద పడుతోంది. ఇందుకు ఏ అధికారి అనుమతించారో తెలపాలి.
నాగరాజు, ఊటకూరు



చిన్మయ కృష్ణ ప్రభును విడుదల చేయాలి


ఇస్కాన్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

హిందూపురం అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల బంగ్లాదేశ్‌లో అరెస్టు చేసిన చిన్మయ కృష్ణ ప్రభును వెంటనే విడుదల చేయాలని ఆదిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇస్కాన్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, నిరసన చేపట్టారు. శనివారం స్థానిక చిన్నమార్కెట్ పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. బెంగళూరు ఇస్కాన్ ప్రతినిధి భక్త బృంద ప్రభు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు వెంటనే ఆపాలని, చిన్మయ కృష్ణ ప్రభును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాడులు ఆపకపోతే తీవ్రంగా స్పందిస్తామని, హిందువుల ఆగ్రహ జ్వాలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి హిందువులను రక్షించాలని కోరారు.

అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

అగళి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సత్యసాయి జిల్లా నేషన్‌హెల్త్ మిషన్ అధికారి నాగరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సకాలంలో సిబ్బంది పనులకు హాజరవుతున్నారా? అని ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో డా.శివానంద, సూర్‌వైజర్లు, నరసారెడ్డి, జయమ్మ, హెల్త్ అసిస్టెంట్, సుబ్బయ్య, సుందరయ్య, భూష్‌నాయక్, ఎఎన్ఎంలు, ఎంపిహెచ్‌డబ్ల్యు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


పడి పూజలో చిన్నారుల వేషధారణ

పెనుకొండ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని షీప్‌ఫారం సమీపంలో త్రిపుర రిసార్ట్‌లో వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. త్రిపుర రిసార్ట్ అధినేత డా.గోపీనాథ్ ఆధ్వర్యంలో కేరళలో ఉండేవిధంగా అయ్యప్పస్వామి 18పడిమెట్లు ఏర్పాటుచేసి గురుస్వాముల ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వామి, వినాయకుడు వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో మండలంలోని మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

చిలమత్తూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్.ఐ మున్నీర్ అహమ్మద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని టేకులోడు గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథంతో కలిసి సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం కల్పించిన హక్కులపై వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీల రక్షణ కోసం ఏర్పాటుచేసిన అట్రాసిటీ చట్టం గురించి ఎస్ఐ వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న అంగన్‌వాడీ నాయకులు

పెనుకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న అంగనవాడీ వర్కర్లపై అధికారుల వేధింపులు అరికట్టాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న పెనుకొండ, రొద్దం మండలాల్లోని అంగనవాడీ వర్కర్లపై అనేకరకాలుగా అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. వర్కర్లకు రావాల్సిన కూరగాయల బిల్లులు, పెండింగ్‌లో ఉన్నవాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంగనవాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, సెక్టర్ లీడర్ సావిత్రమ్మ, లక్ష్మీదేవి, పద్మ, సరస్వతి, సుజాత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై ర్యాలీ

పెనుకొండ టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఐసీటీసీ సీహెచ్‌సి అధికారులు శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రధాన కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టి విద్యార్థులతో హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే హెచ్ఐవి, ఎయిడ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవితో చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.వర్షిత్‌తేజ్, ఐసీటీసీ కౌన్సిలర్ శివజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నూర్‌మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడిగా కిష్టప్ప


కిష్టప్ప

సోమందేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎపీఎస్‌టీఏ జిల్లా అధ్యక్షునిగా సోమందేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కిష్టప్ప ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఏపీఎస్‌టీఏ ఉపాధ్యాయ సంఘం తొలి సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. తనను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు

పెనుకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : కార్తీక శనివారం పురస్కరించుకుని స్థానిక బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం బలిజసంఘం ఆధ్వర్యంలో బ్యానర్లు పట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బలిజ కళ్యాణమండపంలో ఉసిరిచెట్లకు పూజలు నిర్వహించి వనభోజనాలు ఆరగించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి

పెనుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఆరోగ్యంపట్ల ఉపాధ్యాయులు శ్రద్ద తీసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ పిల్లలకు ఏదైనా కంటిచూపు, నడవలేని సమస్యలుంటే వాటిని పరీక్షించి కావాల్సిన పరికరాలను అందజేయాలనే ఉద్దేశ్యంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో ఈఎన్‌టీ వైద్యులు భాస్కర్‌రెడ్డి, ఆప్కాలజిస్ట్ భానునాగశ్రీ, ఫిజియోథెరపిస్ట్ రాజశేఖర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. పరికరాలు అవసరమైన విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు వాటిని అందజేసేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి శరత్‌బాబు, భవిత సెంటర్ హెచ్ఎం వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్ ఇచ్చిన ఘనత చంద్రబాబుదే

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



ఆర్.అనంతపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్/రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏ ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను అందించిన దాఖలాలు లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కడే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను అందించారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎవరైనా ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాతే అన్నారు. ఒకటవతేదీ ఆదివారం వస్తే ఒక్క రోజు ముందే ఏ రాష్ట్రంలోనూ పింఛన్లు అందించరని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి చొరవతో పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కన్వీనర్ లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులు అందరికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పింఛన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని ఆర్ అనంతపురం, ఆమిదాలగొంది, గౌరిపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులకు ఒక్క రోజు ముందుగానే పింఛన్లు పంపిణీచేయడంతో వృద్ధులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి డాక్టర్ సెల్ అధ్యక్షులు,డాక్టర్ కృష్ణమూర్తి, మాజీ సర్పంచు లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

పరిగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : పరిగి మండల కేంద్రంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఒకే రోజు ముందు పింఛన్లు పంపిణీచేశారు. శనివారం బీచిగానిపల్లి, ఊటకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీడీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

94శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

గోరంట్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 11,385 పింఛన్లకుగాను 10,647మందికి శనివారం 93.51శాతం పింఛన్లు అందించినట్లుఅధికారులు తెలిపారు. మిగిలిన 738 పింఛన్లను ప్రభుత్వం వచ్చే నెలలో తీసుకు వెసులుబాటు కల్పించిందన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) :ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయదుర్గం పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ఆయనకు స్వాగతం పలికారు. శనివారం రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంగా అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు చంద్రబాబుకు వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందించారు. శాలువాతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించారు. మడకశిర నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుపై చంద్రబాబు ఆరా తీశారు.

3న చింత ఫలసాయం వేలం

అగళి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అగళి మండలంలోని ఇనగలూరు గ్రామ పంచాయతీలోని చింతఫల సాయాన్ని ఈనెల 3న వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. అదేవిదంగా 4న ఆర్జీపల్లి, 5న ఉదయం అగళి, మధ్యాహ్నం ఇరిగేపల్లి చింత ఫల సాయాన్ని ఆయా గ్రామ పంచాయతీల సచివాలయాలలో వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.3వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

శనైశ్చరుడిని దర్శించుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే


ఆలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పావగడ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పావగడ శనేశ్వరస్వామి ఆలయాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం దర్శించుకొన్నారు. సీతాలంబకు, శనేశ్వరుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పావగడ శనేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో పుణ్యంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎస్ఎస్‌కే డైరెక్టర్ కౌన్సిలర్ వెంకటరమణప్ప, సురేష్‌బాబు, నామినీ కౌన్సిలర్ రామలింగప్ప, అనీల్, తదితరులు ఉన్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేను సత్కరించారు.

కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా పావగడ శనేశ్వరస్వామి ఆలయంలో లక్షదీపోత్సవ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు జేష్టాదేవి సమేతుడైన శనేశ్వరుడికి పూజలు నిర్వహించిన వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గోవిందనామ స్మరణతో ఒక్కసారిగా లక్షదీపాలు వెలిగించి మహిళలు తమ మొక్కుబడిని తీర్చుకొన్నారు. అదేవిధంగా శీతలాంబకు కుంకుమార్చన, అభిషేకం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. పెళ్లి కాని యువతీ యువకులు శీతలాంబను దర్శించుకొన్నారు. లక్షదీపాలు ఒక్కసారి వెలిగించడంతో ఆలయ ప్రాంగణం ముందు పండుగ వాతావరణం నెలకొని భక్తి సంద్రంగా మారింది.

'పురం' అభివృద్ధికి భారీగా నిధులు

- రూ.750కోట్ల పనులకు ఏకగ్రీవ ఆమోదం
- అధికారుల తీరుపై చైర్మన్ అసహనం


అజెండాలోని అంశాలకు ఆమోదం తెలుపుతున్న కౌన్సిల్ సభ్యులు

హిందూపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):హిందూపురం మునిసిపల్ చరిత్రలోనే శనివారం జరిగిన సమావేశం చారిత్రాత్మకమని టీడీపీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం మునిసిపల్ చైర్మన్ బలరాం రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ డీఈ రమేష్ మాట్లాడుతూ హిందూపురం మునిసిపల్ చరిత్రలో ఎన్నడూ ఎరగని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రూ.750కోట్లు నిధులు త్వరలో రానున్నాయని చెప్పారన్నారు. ఇందులో పట్టణంలో అండర్ డ్రైనేజీ కోసం రూ.450కోట్లు, పాత పైప్‌లైన్లు స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.120కోట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలకు మరో రూ.92కోట్లు, వివిధ పనులకు రూ.90కోట్లు మంజూరుచేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఇందులో కొన్నింటికి ఆర్థికశాఖ ఆమోదం తెలుపగా మరి కొన్నింటికి డీపీఆర్ సిద్ధమయింది. కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన ఐదు నిమిషాలకే అజెండాలోని 50అంశాలను ఆమోదించినట్లు తెలుగుదేశం సభ్యులు తెలిపారు. ఇక అభివృద్ధి పనులకు సంబంధించి అనవసరమైన చర్చవద్దని తాము ఏకగ్రీవంగా వీటిని ఆమోదిస్తున్నామంటూ వెళ్లిపోయారు. ఆ తరువాత వైసీపీకి చెందిన సభ్యులు అజెండాలో అంశాలన్నింటిపై ప్రశ్నించారు. కొన్నింటికి ఎక్కువగా నిధులు పెట్టారని వైసీపీ సభ్యులు అడగడంతో అందుకు మునిసిపల్‌కమిషనర్ సంఘం శ్రీనివాసులు దీటుగా సమాధానం ఇచ్చారు. మునిసిపాలిటీలో జరిగే పనుల్లో ఎవరికి అనుమానాలు అవసరం లేదని పారదర్శకంగా పనులు జరుగుతాయన్నారు. గొల్లపల్లి ప్రాజెక్ట్ వద్ద మోటారు మరమ్మతు విషయంపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు కమిషనర్ బదులిస్తూ మోటార్ రిపేరు చేయడం, పట్టణానికి నీరు ఇవ్వడం అవసరం లేదా? అంటూ ప్రశ్నించారు. ఆ తరువాత అంశాలన్నీ ఆమోదిస్తున్నట్లు చైర్మన్ పేర్కొంటూ సమావేశం ముగించారు.

అధికారులపై చైర్మన్ అసహనం

ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, అప్పటికే వైసీపీ సభ్యులు ఎవరురాలేదు. అభివృద్ధి పనులకు సంబంధించి కొంతమంది వైసీపీ సభ్యులు కమిషనర్ ఛాంబర్‌లో చర్చిస్తున్నారు. దీంతో చైర్మన్ బలరాంరెడ్డి, కమిషనర్ ఛాంబర్ ముందుకు వచ్చి సమావేశం ప్రారంభించలేదంటూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్ చైర్మన్‌వద్దకు వెళ్లి సమావేశం ప్రారంభిద్దామని తీసుకెళ్లారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

స్కూల్ టీచర్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా ప్రదీప్‌కుమార్

అమరాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా సత్యసాయి జిల్లా అమరాపురం మండలం నిద్రగట్ట ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు హెచ్.ప్రదీప్‌కుమార్, ఆడిట్ కన్వీనర్‌గా డి.అగ్రహారం జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కరిబడప్పలు ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రాథమిక పాఠశాలను నిర్వీర్యం చేస్తున్న జీవోనెంబర్ 117ను రద్దు, యాప్‌ల భారం తగ్గింపు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు వంటి సమస్యలపై సంఘం పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా లింగనాయక ఎన్నిక

పావగడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నలిగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన లింగనాయక శనివారం జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. 15 మంది పంచాయతీ సభ్యులు ఉన్న నలిగానహళ్లిలో శనివారం జరిగిన అధ్యక్ష ఎన్నికలకు కాంగ్రెస్ తరపున లింగనాయక, జేడీఎస్ పార్టీకి చెందిన రామాంజినప్ప నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. లింగనాయకకు 9 ఓట్లు, రామాంజనప్పకు 6 ఓట్లు రావడంతో లింగనాయక అధ్యక్షుడిగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. లింగనాయక ఎన్నికపట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడి మృతి

రొళ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం ఆవినకుంట తాండా గ్రామానికి చెందిన మాజీ సిగింల్‌విండో అధ్యక్షుడు మోతీరామ్‌నాయక్ ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారు. తన సొంత పొలంలో దుక్కి దున్నుతున్న సమయంలో మినీట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి మోతీరామ్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. కాలనీ వాసులు మృతదేహాన్ని సందర్శించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

శనైశ్చర ఆలయంలో లక్షదీపోత్సవం



హిందూపురం అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీలో నెలకొన్న శనైశ్చర స్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరు శనివారం సందర్భంగా లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు గోపీస్వామి ఆధ్వర్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగం ఆకారం ఏర్పాటు చేసి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను పూలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.



ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

అమరాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని ఎస్సీల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు, ప్రభుత్వాలు తాత్సారం చేయకుండా వెంటనే అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.ఆర్.హనుమంతు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని దళిత నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, స్మృతివనం పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమీషన్ల పేరిట కాలయాపన చేయకుండా వర్గీకరణ అమలయ్యేంత వరకు ఉద్యోగాలు భర్తీ చేయకుండా చూడాలని లేకుంటే ఉద్యమం చేయాల్సి వస్తుందని తెలిపారు.

ప్రజాదర్బార్ విజయవంతం చేయండి

గుడిబండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గుడిబండ తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో సోమవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మంజునాథ్‌లు తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వివిధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు అధిక సం ఖ్యలో హాజరై తమ సమస్యలను విన్నవించుకొని పరిష్కరించుకోవాలని వారు కోరారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసై అనారోగ్యానికి గురై మనస్థాపం చెంది వరదప్ప(55)అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కియా ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు వెంకటగిరి పాళ్యంకు చెందిన గాండ్ల వరదప్ప కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల తాగుడుకు బానిసై కడుపునొప్పి అధికం కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరికి వేలాడుతున్న విషయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.